సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 17 । ఆగస్టు । 2024



స్తంభించిన జనజీవనం 8లో

మన్యంలో కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. పాడేరులో వారపు సంతకు అంతరాయం ఏర్పడింది.



మెరుగైన విద్యకు చర్యలు 8లో

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుకు చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు ఆదేశించారు.



వైద్య సిబ్బంది సాహసం

పెదబయలు మండలంలో వైద్యసిబ్బంది గెడ్డలు దాటుకుని గ్రామాలకు వెళ్లి వైద్యసేవలందించారు. 9లో

చింతూరు ఏఎస్పీగా పంకజ్ కుమార్



చింతూరు: స్థానిక పోలీసు సబ్‌డివిజన్ ఏఎస్పీగా పంకజ్‌కుమార్ మీనా నియమితులయ్యారు. 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా విధులు నిర్వహిస్తూ చింతూరు ఏఎస్పీగా నియమితులయ్యారు. కాగా ప్రస్తుతం చింతూరు ఏఎస్పీగా విధులు నిర్వహి స్తున్న రాహుల్‌మీనా అనంతపురం జిల్లా గుంతకల్ రైల్వే ఎస్పీగా బదిలీ అయ్యారు. ఈయన ఇక్కడ 16 నెలల పాటు ఏఎస్పీగా సేవలందించారు.

ఉదయం 7.30



మధ్యాహ్నం 1.30



సాయంత్రం 4.30



త్రి కాలం

సాధారణంగా ఎండాకాలంలో వానలు.. వానాకాలంలో బాగా ఎండ కాయడం చూసుంటాం. కానీ విచిత్రంగా ఒకే రోజు మూడు రకాల వాతావరణం కనిపిస్తే ఎలా ఉంటుంది. అవును జిల్లాలోని డుంబ్రిగుడ ప్రాంతవాసులు ఒకే రోజు మూడింటిని చూశారు. శుక్రవారం ఉదయం 7.30 వరకు మంచు దుప్పటి కప్పేసింది.. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఎండ మండిపోయింది. సాయంత్రానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడి నాలుగు నుంచి ఐదు గంటల మధ్యలో భారీ వర్షం కురిసింది. ఇలా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను స్థానికులు ఆస్వాదించారు. ప్రకృతి అందాలకు నెలవైన మన్యంలో ఈ విభిన్న వాతావరణంతో మంచి అనుభూతి పొందారు.

– డుంబ్రిగుడ

చేర్చుకున్నారు.. ఛీ కొట్టారు

మీ దారి మీ ఇష్టం...!

- పార్టీ మారిన ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు కూటమి ఝలక్
- ప్రలోభాలతో పార్టీ మారిన కొందరు స్థానిక నేతలు
- ఎమ్మెల్సీ ఏకగ్రీవంతో ఇప్పుడు పట్టించుకోని వైనం
- స్థానిక నేతలు అంగీకరించడం లేదంటూ మెలిక
- డబ్బు ఇస్తామని ఆశ చూపి...ఇప్పుడు పట్టించుకోని దుస్థితి



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఏరు దాటే వరకు ఓడ మల్లన్న... ఏరు దాటిన తర్వాత బోడి మల్లన్న అన్న చందంగా తయారైంది స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్లేటు ఫిరాయించిన నేతల పరిస్థితి. మొదట్లో డబ్బు, పదవి, పనుల ప్రలోభాలతో పార్టీలో చేర్చుకుని... తీరా పార్టీ మారిన తర్వాత కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు అచ్చం ఇలాగే ఉందని వాపోతున్నారు. ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో ఉందామని భావించి భారీగా ప్రలోభాలకు దిగిన కూటమి నేతలు.. ఇప్పుడు ఏకగ్రీవంతో చేతులెత్తేశారు. పార్టీ మారిన నేతలకు... స్థానికంగా తమ నాయకులు అంగీకరించడం లేదని కూటమి పెద్దలు కొర్రీలు పెడుతున్నారు. ఇస్తామన్న డబ్బు ఇవ్వకపోవడంతోపాటు పార్టీ పదవులు కూడా ఇవ్వలేమని తేల్చిచెబుతున్నారు. **ఇక మీ దారి మీ ఇష్టమం**టూ కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ మారి భారీగా దండుకుందామని ఉవ్విళ్లూరిన స్థానిక నేతలకు గట్టి దెబ్బే తగిలింది. తమకు సీటిచ్చి... గెలిపించిన పార్టీని కాదని ఆశతో పార్టీ మారిన నేతలకు కొత్త ఇబ్బందులు వచ్చిపడ్డాయి. ఇస్తామన్న డబ్బు ఇవ్వలేదని.. అధికార పార్టీలో చేరి కొన్ని కాంట్రాక్టులు దక్కించుకుందామనుకుంటే కనీసం ఇప్పుడు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఫలితంగా కూటమి నేతలు అసలు స్వభావం తమకు బాగా తెలిసి వచ్చిందని మండిపడుతున్నారు.

భారీగా ఆశలు చూపి...!

బరిలో నిలిచేందుకు అనుగుణంగా 200 మందికిపైగా నేతలను తమ వైపు తిప్పుకోవాలని కూటమి నేతలు ఎవరికి వారు ప్రయత్నాలు ప్రారంభించారు. తోచిన హామీ ఇచ్చి అడిగినంత నగదు ముట్టచెబుదామంటూ వరాల వర్షం కురిపించారు. పార్టీలో చేరిన తర్వాత కాంట్రాక్టులు ఇప్పిస్తామని కూడా పేర్కొన్నారు. ఈ మాయ మాటలను నమ్మిన కొద్దిమంది ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ నుంచి కూటమి పార్టీల్లో చేరారు. ఎన్నికలు ముగిసి కూటమి అభ్యర్థి గెలిచిన వెంటనే హామీ ఇచ్చిన మేరకు నగదు ముట్టచెబుదామని పేర్కొన్నారు. అయితే, చేరికలు అనుకున్న మేరకు లేకపోవడం, ఓటమి ఖాయమని తెలిసి బరిలో నిలిచేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమయ్యింది. దీంతో అప్పటివరకు ఆశలు చూపిన కూటమి నేతలు ఒక్క హామీని నెరవేర్చకుండా జారుకున్నారు. అంతేకాకుండా స్థానికంగా ఉన్న తమ పార్టీ నేతలు... మీ చేరికలను అంగీకరించడం లేదని మెలిక పెట్టడం ప్రారంభించారు. అందువల్ల పార్టీలో కూడా చేర్చుకోలేమని స్పష్టం చేశారు. ఫలితంగా కొద్దిమంది నేతలు తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరుతుండగా.. మరికొందరు నేతలు ముఖం చెల్లక తిరిగి వచ్చేందుకు జంకుతున్నారు. మొత్తంగా తమ పరిస్థితి ఓడ మల్లన్న... బోడి మల్లన్నగా మారిందంటూ వాపోతున్నారు.

బరిలో నిలుద్దామని...

విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 830 ఓట్లు కాగా.. అందులో 615 ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఉన్నాయి. మిగిలిన 215 ఓట్లు మాత్రమే కూటమికి చెందినవి.. అయినప్పటికీ ఎన్నికల్లో నిలిచి ప్రలోభాలతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను కొనుగోలు చేద్దామని భావించారు. ఇందుకు అనుగుణంగా ఎక్కడికక్కడ సమావేశాలను కూడా నిర్వహించారు. అయితే వైఎస్సార్‌సీపీ ఒక అడుగు ముందుకు వేసి.. బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు కూటమి నుంచి ఎవరిని బరిలో నిలుపుదామనే విషయంలోనే ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. మొదట్లో గండి బాబ్జీ, పీలా గోవింద్ పేర్లు ప్రముఖంగా వినిపించాయి. తీరా బొత్స సత్యనారాయణను అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత వీరిద్దరూ పోటీలో ఉండమని తేల్చిచెప్పారు. మరోవైపు వైఎస్సార్‌సీపీకి చెందిన నేతలతో నేరుగా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశాలకు మెజార్టీ నేతలు హాజరయ్యారు. కూటమి నేతలు భారీగా ప్రలోభాలు చూపుతూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లను తమవైపు లాగేందుకు ప్రయత్నించారు. కొద్దిమంది ప్రలోభాలకు లొంగి అటువైపు చేరారు. అయినప్పటికీ ఆశించినస్థాయిలో చేరికలు లేకపోవడం వంటి పరిస్థితులల్లో బరిలో నిలిచేందుకు కూటమి నేతలు ఒక్కొక్కరు వెనుకడుగు వేశారు. చివరికి దిలీప్ చక్రవర్తి పేరును మంత్రి లోకేష్ తెరమీదకు తెచ్చారు. అయితే పోటీ చేయవద్దని కోరుతూ దిలీప్ చక్రవర్తి వ్యాపార భాగస్వామి, ఎమ్మెల్సీతో మాజీ మంత్రి ఒకరు గట్టిగా చెప్పించారు. అనవసరంగా బరిలో నిలిచి జేబు ఖాళీ చేసుకోవద్దంటూ సలహా ఇచ్చారు. ఫలితంగా ఆయన కూడా పోటీకి వెనుకడుగు వేశారు. పైకి మాత్రం విలువలు, విశ్వసనీయత అని చెప్పి పోటీలో నిలవడం లేదని చంద్రబాబు ప్రకటించారు. ఈ ప్రకటనలతో అప్పటి వరకు భారీగా ప్రలోభాలు ప్రకటించిన కూటమి నేతలు పార్టీలో చేరిన నేతలను పట్టించుకోవడం మానేశారు.

అనితర సాధ్యుడు బొత్స

ప్రజాబలమున్న నాయకుడు.. ఉత్తరాంధ్రకు ఆప్తుడు.. రాజకీయాల్లో ఢక్కీమొక్కీలు తిన్న విజయనగరం పెద్దాయన.. ఆయనెవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందరూ అభిమానించే బొత్స సత్యనారాయణ. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైఎస్సార్‌సీపీ వ్యూహాలు, బొత్స సత్యనారాయణ స్థాయి ముందు కూటమి ఎత్తుగడలు ఫలించలేదు. శతవిధాలా కూటమి నేతలు ప్రయత్నించినప్పటికీ బొత్స బలం ముందు ఎవరూ పోటీ చేయడానికి సాహసం చేయలేకపోయారు. దీంతో బొత్స.. ఎదురన్నదే లేకుండా ఎమ్మెల్సీగా గెలుపొందారు.

- అందరికీ ఆమోదం.. అందుకే ఏకగ్రీవం
- బొత్స రాజకీయ చతురత ముందు నిలవలేని కూటమి కుయుక్తులు
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవ ఎన్నిక



సాక్షి, విశాఖపట్నం: విద్యార్థి దశ నుంచే తోటి విద్యార్థులకు సహాయం చేయడం, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం వంటి నాయకత్వ లక్షణాలు అలవరుచుకున్న బొత్స అంచెలంచెలుగా.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా అనేక పదవులు చేపట్టారు. తన రాజకీయ చరిత్రలో అందరివాడుగా నిలిచారనే చెప్పుకోవచ్చు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బొత్స వ్యూహం ముందు కూటమి పార్టీలే డీలా పడ్డాయి. వైఎస్సార్‌సీపీకి స్థానిక సంస్థల ఓటర్ల బలముంది. దీంతోపాటు ఎన్నికల నిర్వహణ నైపుణ్యం కలిగిన బొత్సను బరిలోకి దించడంతో ఆయనకు దీటైన పోటీ కోసం కూటమి ప్రభుత్వం గట్టి కసరత్తు చేసింది. కానీ బొత్స వ్యూహం ముందు కూటమి ప్రణాళికలు చిన్నబోయాయి. బలం లేకున్నా ఎమ్మెల్సీ స్థానం వైఎస్సార్‌సీపీకి దక్కకుండా చేయాలని కూటమి నేతలు కుయుక్తుల పన్నినా.. వారి పన్నాగాలు ఫలించలేదు. ఆ స్థానానికి మొత్తం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి బొత్స సత్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సఫీ ఉల్లా నామినేషన్లు వేశారు. వైఎస్సార్‌సీపీ జోరు చూసి కూటమి వెనక్కి తగ్గింది. బొత్సపై అభిమానంతో వేసిన ఒక్క నామినేషన్‌ను కూడా ఈ నెల 14వ తేదీన ఉపసంహరించుకున్నారు. దీంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవమైంది.

వైఎస్సార్ కుటుంబమంటే అమితమైన ప్రేమ

బొత్స సత్యనారాయణకు వైఎస్సార్ కుటుంబమంటే అమితమైన ప్రేమ. అప్పుడు మహానేత వైఎస్సార్‌తో సన్నిహితంగా మెలిగిన బొత్స.. ఇప్పుడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కూడా అంతే సన్నిహితంగా ఉంటున్నారు. మహానేత వైఎస్సార్ కేబినెట్‌లో ఉత్తరాంధ్ర ప్రాంత వెనకబడిన వర్గాలకు చెందిన బొత్సకు అప్పట్లో కీలక మంత్రి పదవి కేటాయించారు. మళ్లీ అదే తరహాలో 2019–24లో ఐదేళ్లపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేబినెట్‌లో కూడా కీలక మంత్రి పదవులు చేపట్టారు. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందారు.

న్యూస్‌రీల్

ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు తప్పిన ప్రమాదం



పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్ బస్సు

ఎటపాక(చింతూరు): ఛత్తీస్‌గఢ్ నుంచి హైదరాబాద్ వెళుతున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు ప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి ఎటపాక మండలం రాంగోపాలపురం వద్దకు వచ్చేసరికి బస్సు అదుపు తప్పి పక్కనేవున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కల్వర్టుకోసం ఏర్పాటుచేసిన మట్టి వల్ల ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు తెలిపారు. ఈ సమయంలో బస్సులో 50 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు.

'గాలికొండ'కు పర్యాటకుల తాకిడి



వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు

అరకులోయ రూరల్: మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన గాలి కొండ వ్యూపాయింట్‌కు శుక్రవారం పర్యాటకుల తాకిడి నెలకొంది. భారీగా తరలిరావడంతో ఘాట్‌రోడ్డు రద్దీగా మారింది. కుటుంబ సమేతంగా తరలివచ్చిన పర్యాటకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు.

బాల్య వివాహాల నివారణకు సఖి గ్రూపులు

- బాలికలకు అవగాహన కల్పించడంతోనే నివారణ సాధ్యం
- జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ్

సాక్షి, పాడేరు: అన్నిశాఖల పరస్పర సహకారంతో బాల్య వివాహాల నివారణ సాధ్యమని, ఇందుకు సఖి గ్రూపులు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ అన్నారు. డివిజన్ స్థాయి బాల్య వివాహాల నిషేధం, పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రాపవుట్లు, టెన్త్ తప్పిన ఆడపిల్లలపై ప్రత్యేకంగా దృష్టి సారించడం ద్వారా బాల్య వివాహాలను నియంత్రించవచ్చన్నారు. పీవీటీజీ, మారుమూల గ్రామాల్లో ఇటువంటి సాంఘిక దురాచారాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గిరిజన ఆచార, వ్యవహార, సంప్రదాయాలను గౌరవిస్తూనే బాల్య వివాహాలు వలన జరిగే నష్టాలు, కష్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో 11నుంచి 14, 14నుంచి 18 వయస్సు యువతులతో ప్రత్యేకంగా సఖి గ్రూప్‌లు ఏర్పాటు చేసి బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కన్వీనర్, ఐసీడీఎస్ సీడీపీవో ఝాన్సీలక్ష్మి, సభ్యులు డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీఈవో బ్రహ్మాజీరావు, డీపీవో కొండలరావు, వెలుగు ఏపీడీ చిన్నారావు, డీపీఆర్వో గోవిందరాజులు, సచివాలయాల కో ఆర్డినేటర్ సునీల్, సీఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

వరాల తల్లికి వ్రత పూజలు



పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో సాముహిక వరలక్ష్మీ వ్రతాలు 8లో



అరకులోయ పూజలందుకున్న భ్రమరాంబిక దేవి

పాడేరులో మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు



బురదలో కూరుకుపోయి.. పంక్చర్‌తో నిలిచిపోయి..

అత్యవసర వైద్య సేవలను చేరువ చేసే 104, 108 వాహనాలకు అవరోధాలు తప్పడం లేదు. మారుమూల గ్రామాలకు పక్కా రహదారులు లేకపోవడం, వాహనాల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం ఇందుకు కారణమవుతోంది. శుక్రవారం గూడెంకొత్తవీధి, చింతూరు మండలంలో నెలకొన్న ఘటనలే ఇందుకు అద్దం పడుతున్నాయి.



అంబులెన్సులోంచి మగ శిశువును బయటకు తీసుకొస్తున్న వైద్యాధికారి విశ్వచైతన్య

ఆపద్బాంధవికి కష్టకాలం

- రింతాడ వద్ద నిలిచిపోయిన 104
- సరివెల వద్ద ఆగిపోయిన 108
- అధ్వానంగా రహదారులు, వాహనాలకు నిర్వహణ లేకపోవడమే కారణం



బురదలో కూరుకుపోయిన 104 వాహనం

గూడెంకొత్తవీధి: వైద్యసేవలు అందించేందుకు బయలుదేరిన 104 వాహనం బురదలో కూరుకుపోయింది. మండలంలోని రింతాడ పంచాయతీ పరిధిలోని ఇంద్రానగర్, కొత్తూరు గ్రామాల్లో వైద్యసేవలు అందించేందుకు 104 వాహనంలో మండల కేంద్రంనుంచి సిబ్బంది బయలుదేరారు. మార్గం మధ్యలో కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. బురదమయంగా మారిన రహదారిలో ఉదయం పది గంటలకు కూరుకు పోయింది. సిబ్బంది శ్రమించినా ఫలితం లేకపోయింది. వెంటనే హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ రింతాడ వెళ్లి, అక్కడి ట్రాక్టర్‌ను తీసుకువచ్చారు. దాని సాయంతో అంబులెన్సును బురదలోంచి బయటకు తీశారు. అప్పటివరకు వైద్యసిబ్బంది అవస్థలు పడ్డారు.

వైద్యాధికారి చొరవతో గర్భిణికి తప్పిన ప్రాణాపాయం

చింతూరు: గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్సుకు మార్గం మధ్యలో టైరు పంక్చర్ అయింది. ఈ విషయం తెలుసుకున్న వైద్యాధికారి అక్కడి వెళ్లి సత్వర వైద్యం అందించడంతో గర్భిణి ప్రాణాపాయం నుంచి బయటపడింది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని సరివెల వద్ద శుక్రవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. వీఆర్‌పురం మండలం పత్తిపాకకు చెందిన గర్భిణి మడివి పార్వతి పురుడు నిమిత్తం స్వగ్రామమైన చింతూరు మండలం వంకగూడెంలోని తల్లి వద్దకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఆమెకు శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. ఈఎంటీ కృష్ణార్జునరావు, పైలట్ సురేష్ వెంటనే స్పందించి వంకగూడెం చేరుకున్నారు. గర్భిణి పార్వతిని వాహనంలో ఎక్కించుకుని చింతూరు ఏరియా ఆస్పత్రికి తీసుకువస్తుండగా సరివెల వద్దకు రాగానే వాహనం టైరు పంక్చరవడంతో నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విశ్వచైతన్య వెంటనే మరో అంబులెన్సుతో అక్కడికి చేరుకున్నారు. ఆమె సత్వర వైద్యం అందించడంతో గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే తల్లీబిడ్డను అక్కడి నుంచి స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు.

దేవస్థాన భూముల ఆక్రమణపై వివాదం



గిరిజనులు,దేవస్థానం అధికారుల మధ్య తోపులాట

ఎటపాక: మండల పరిధిలో పురుషోత్తపట్టణం వద్ద ఉన్న భద్రాది దేవస్థానం భూముల ఆక్రమణలపై మళ్లీ వివాదం చెలరేగింది. రామాలయం గోశాల సమీపంలో కొందరు భూమి ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేస్తున్నారనే సమాచారంలో శుక్రవారం దేవస్థానం ఈవో రమాదేవి సిబ్బంది,పోలీసులతో అక్కడకు చేరుకున్నారు. అయితే నిర్మాణంలో ఉన్న ఇంటి గోడలను దేవస్థానం సిబ్బంది కూల్చివేస్తుండగా గిరిజనులైన నిర్మాణదారులు తొలగింపును అడ్డుకున్నారు. ఈక్రమంలో దేవస్థానం అధికారులు, గిరిజనుల మధ్య తోపులాట జరిగటంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఎటపాక పోలీసులు,రెవెన్యూ అధికారులు కూడా అక్కడకు చేరుకుని తోపులాటను అడ్డుకున్నారు. గిరిజనేతరులు నిర్మాణాలు చేసినా ఏమి చేయని దేవస్థానం అధికారులు గిరిజనులమైన తమను అడ్డుకోవడం ఏమిటని నిర్మాణదారులు ప్రశ్నించారు. కాగా భూముల వివాదం కోర్టు పరిధిలో ఉన్నందున తీర్పు వచ్చేవరకు ఈస్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని రెవెన్యూ అధికారులు హెచ్చరించడం వివాదం ప్రస్తుతం సద్దుమణిగింది.

క్లుప్తంగా

స్తంభించిన జనజీవనం



పాడేరులో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు

సాక్షి,పాడేరు: మన్యంలో కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరుతోపాటు పెదబయలు,పాడేరు, హుకుంపేట మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. పాడేరులో వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం నీరు రోడ్లపై నుంచి ప్రవహించింది.

జి.మాడుగుల: మండలంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది.మెయిన్ రోడ్డు, పంటపొలాలు, వీధుల్లోని రోడ్లు జలమయమయ్యాయి. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, నుర్మతి, సొలభం, గడుతూరు, వంజరి, గెమ్మెలి లువ్వాసింగి రోడ్డు మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ కృష్ణంరాజుకు సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

అడ్డతీగల/గంగవరం : అడ్డతీగల మండలం తిమ్మాపురం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగవరం మండలానికి చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన వివరాలు.. గంగవరం మండలం ట్యాంకుబీడు గ్రామానికి చెందిన కాకర్లపూడి కృష్ణంరాజు (55) బైక్‌పై గంగవరం నుంచి ఏలేశ్వరం వెళ్తుండగా అడ్డతీగల మండలం తిమ్మాపురం వద్ద చెట్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అడ్డతీగల 108కు సమాచారం అందించారు. 108 ఈఎంటీ సంధ్య, పైలెట్ ఎస్‌కే.బి నవాజ్ తదితరులు గాయపడిన కృష్ణంరాజుకు ప్రథమ చికిత్స అందించారు.అనంతరం ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు సిబ్బంది తెలిపారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా నేడు విధుల బహిష్కరణ

నేటి ఉదయం 6 గంటల నుంచి 24 గంటలు

చింతూరు: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు చింతూరు డివిజన్లోని పీహెచ్‌సీల్లో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 24 గంటల పాటు విధులు బహిష్కరిస్తున్నట్లు ఏపీ పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన దారుణ సంఘటనకు నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

డిసెంబర్ నాటికి సెల్ టవర్ల నిర్మాణం పూర్తి

కలెక్టర్ దినేష్‌కుమార్



నులిపురుగుల నివారణ ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు



సెల్ నెట్‌వర్క్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సెల్‌టవర్ల నిర్మాణాలను ఈఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జియో, బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ల అధికారులతో ఆయన సమీక్షించారు.సెల్‌టవర్ల నిర్మాణాలకు అన్ని విధాల సహకరిస్తామని ఆయన తెలిపారు.అన్ని గ్రామాలకు నెట్‌వర్క్ అందుబాటులో వస్తే టీచర్ల బయోమెట్రిక్‌తో పాటు అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు పంపిణీ సక్రమంగా జరుగుతుందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ సంస్థకు 938 టవర్లకు అనుమతి ఇస్తే 112 పూర్తి చేశారని, మిగిలిన 739 టవర్లను డిశంబర్‌లోగా పూర్తి చేయాలని సూచించారు. పెదబయలు మండలం బురుగుపుట్టు,మారేడుమిల్లి మండలం గుడిసెలో టవర్ల నిర్మాణానికి నెలకొన్న స్థల సమస్యను ఈనెల 27వతేదీన డీఎల్‌సీ సమావేశంలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. జియో సంస్థ పరిధిలోని 465 టవర్లకు గాను ఇప్పటికి 396 టవర్లు పూర్తి కాగా మిగిలిన 69 టవర్లను వెంటనే వినియోగంలోకి తేవాలన్నారు. ఎయిర్‌టెల్‌కు సంబంధించి 112 టవర్లల్లో 107 పూర్తయ్యాయని మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.రహదారులు దెబ్బతినకుండా లైన్లు పటిష్టంగా వేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ్, నెట్‌వర్క్‌ల ప్రతినిధులు శ్రీకాంత్‌పట్నాయక్, సత్యప్రసాద్, గంగాధర్, సత్య, సూర్య పాల్గొన్నారు.

డీవార్మింగ్ విజయవంతం చేయాలి

జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాలయాల్లోను ఈనెల 20వతేదీన విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. డీవార్మింగ్ కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కడుపులో నులిపురుగులను నిర్మూలిస్తే విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. ఈనెల 28వతేదీన కూడా జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల్లో ఈకార్యక్రమం నిర్వహించి నులిపురుగుల నివారణ మాత్రలను మింగించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఈవో బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా రహదారి ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని,కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్‌లో రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఘాట్‌రోడ్లలో కొమ్మలు,పొదలు తొలగించాలని,అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయాలన్నారు.ఘాట్ రోడ్లలో జీపులకు బదులు 30,40సీట్లతో మినీ బస్సుల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ట్రయల్ బేసిస్‌లో పైలట్ ప్రాజెక్టు అమలుకు అనుమతులు ఇస్తానన్నారు. జీరో ఆక్సిడెంట్ డ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందిస్తే మరింత ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. వడ్డాది–పాడేరు.లంబసింగి–డౌనురు,కొక్కిరాపల్లి ఘాట్‌ల విస్తరణకు తగిన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఎస్పీ అమిత్‌బర్దర్ మాట్లాడుతూ ఏజెన్సీలోని అన్ని రోడ్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు గతంలో జరిగిన ప్రమాదాల వివరాలను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. ఐఆర్‌ఏడీ లాగిన్‌ను అన్ని ప్రభుత్వ వైద్యశాలలకు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్, మోటార్ వాహనాల అధికారి రాజేష్, ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, ఈఈలు కొండయ్య, బాలసుందరబాబు పాల్గొన్నారు.

30 కిలోల గంజాయి పట్టివేత

ఒకరి అరెస్టు



పట్టుకున్న గంజాయి బస్తాలు, నిందితుడితో పోలీసులు, వీఆర్‌వోలు

ముంచంగిపుట్టు: తరలించేందుకు సిద్ధంగా ఉన్న 30 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకుని, ఒకరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. స్థానిక ఎస్‌ఐ రవీంద్ర అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బాబుశాల పంచాయతీ జాడిగూడలో ఓ ఇంటిలో గంజాయి ఉన్నట్టు సమాచారం అందడంతో ముంచంగిపుట్టు పోలీసులు శుక్రవారం ఆ గ్రామానికి చేరుకున్నారు. గమనించిన గ్రామానికి చెందిన కొర్రా అస్సు అనే వ్యక్తి,రెండు బస్తాలతో పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న రెండు బస్తాలను పరిశీలించగా గంజాయి లభించింది. దీంతో నిందితుడిని అరెస్టు చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరించారు.పట్టుకున్న గంజాయి 30కిలోలు ఉందని, దీని విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ రవీంద్ర చెప్పారు. కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.ఈ దాడిలో ఏఎస్‌ఐ కె.లక్ష్మయ్య, కానిస్టేబుళ్లు కె.రామరాజు,కె.వెంకటరావు,కె.మోహన్‌దాసు, వీఆర్‌వోలు భాస్కర్,పద్మరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు: విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఏపీఈపీడీసీఎల్ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ముంచంగిపుట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని మాకవరం ఫీడర్ గ్రామమైన కించాయిపుట్టు, ధారపల్లి, సరియాపుట్టు, రంగబయలు, మజ్జిగూడ గ్రామాలతో పాటు పలు గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.
- మండల కేంద్రం కొయ్యూరులోని 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా కృష్ణదేవిపేట, కాకరపాడు, ఐటీడీఏ కాలనీ, సింగవరం, మంప, దొడ్డవరం, చింతలపూడి. ఎం.మాకవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారి



తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ సంతోష్

అరకులోయ రూరల్: డుంబ్రిగుడ మండలం అరకు సంతబయలులో తప్పిపోయిన బాలుడిని పోలీసులు గ్రామస్తుల సహకారంతో చిన్నారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటనపై ఎస్‌ఐ సంతోష్ తెలిపిన వివరాలు.. డుంబ్రిగుడ మండలం కురిడి పంచాయతీ పుట్టబంధ గ్రామానికి చెందిన మోద్నో తన భార్య, మూడు సంవత్సరాల కుమారుడు పోతురాజుతో సంతబయలు వారపు సంతకు శుక్రవారం వచ్చారు. అయితే సంతలో వస్తువుల కొనుగోలు అనంతరం తమతో ఉన్న బాలుడు తప్పిపోయినట్టు తల్లిదండ్రులు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంతలో ఒంటరిగా తిరుగుతున్న చిన్నారిని కొంతమంది స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. బాలుడి వివరాలు సేకరించిన పోలీసులు బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న చిన్నారి తల్లిదండ్రులు, బంధువులు పోలీసుస్టేషన్‌కు వచ్చారు. తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. వారు సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారని ఆయన చెప్పారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



ఆస్పత్రి సూపరింటెండెంట్ రాముతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయటౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులందరికి మెరుగైన వైద్య సేవలందించాలని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాముకు సూచించారు. అరకులోయ ఏరియా ఆస్పత్రిని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం సందర్శించారు. అత్యవసర విభాగం, వార్డులకు వెళ్లి రోగులతో మాట్లాడి వారి కి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మూడు పూటల అందిస్తున్న భోజన సదుపాయం, మందులు సక్రమంగా అందు తున్నాయా? లేదా అని ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాముతో చర్చించారు. రోగులకు అందిస్తున్న సేవలు, మందులు, పాముకాటు వ్యాక్సిన్, మందుల స్టాక్‌ను అడిగి తెలుసుకున్నారు.

వైద్య సేవలపై పర్యవేక్షణ అవసరం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గిరిజన ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారని, ఆస్పత్రికి వచ్చిన రోగికి వెంటనే మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రస్తుత ఖరీఫ్ పనులకు పొలాలకు వెళ్లే రైతులు పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉందని, తక్షణమే వారికి వైద్య సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రులే గిరిజన నిరుపేదలకు దిక్కు అని అన్నారు. అరకు ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య నిపుణులున్నారని, ఇక్కడ మెరుగైన వైద్యసేవలందిస్తే పాడేరు జిల్లా ఆస్పత్రి, విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆస్పత్రిలోని వైద్య నిపుణులు, వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చి, వైద్య సేవలపై ప్రతీ రోజు పర్యవేక్షణ చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రోగుల నుండి ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చూసుకోవాలని, వైద్యులు, వైద్య సిబ్బంది సేవా దృక్పథంతో రోగులకు సేవలందించాలని సూచించారు.

నిత్యం భయం.. భయం

- శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనం
- బీటలు వారిన గోడలు.. పాడైన కిటికీలు, తలుపులు
- పెచ్చులూడుతున్న శ్లాబ్
- ఆందోళనలో సిబ్బంది, స్థానికులు
- పట్టించుకోని యంత్రాంగం



పెచ్చులూడుతున్న తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్

గంగవరం : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలస్థితికి చేరుకుంటోంది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం రిపేర్లకు నోచుకోక బీటలు వారింది. చినుకు పడితే గదులన్నీ జలమయం.. ఇటీవల కురిసిన వర్షాలకు శ్లాబ్ లీకుల మయంగా మారింది. ఏ గది చూసినా లీకులు, వర్షపు నీరే. ఒక వైపు భవనం గోడలు బీటలు వారగా, తలుపు, కిటికీలు చెడిపోయి శిథిలస్థితిలో దర్శనమిస్తున్నాయి. శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండడంతో సిబ్బంది , కార్యాలయానికి వచ్చే ప్రజలు, భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా కంప్యూటర్ రూమ్, ఫైల్స్ భద్రపరిచే స్టోర్ రూమ్, కోర్టు హాలు కారిపోతోంది. వర్షం కురిసినపుడు గదుల్లో నీరు చేరడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కంప్యూటర్లు, రికార్డులు తడిచిపోతుండడంతో ప్లాస్టిక్ కవర్లు , బరఖాలు కప్పి జాగ్రత్త పడుతున్నారు. అలాగే ప్రతీ గది లీకులు వస్తున్నాయి. విద్యుత్ స్విచ్‌లు వేసేందుకు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం తడిచి ముద్దవుతోంది. భవనం రిపేర్లకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయం శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే భవనం మరమ్మతు పనులు చేయించాలని స్థానికులు తదితరులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి తహసీల్దార వీరభద్రరావు మాట్లాడుతూ భవనం సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

మరమ్మతు చేయాలి



తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరింది. కార్యాలయంలోనికి రావాలంటే భయం వేస్తుంది. వర్షం పడితే గదుల్లో నీరు చేరుతోంది. కూర్చునేందుకు వీలు లేకుండా ఉంటుంది. ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందో భయమేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి భవనం మరమ్మతు పనులకు స్పందించాలి.

– పండా సిద్దార్థ, గంగవరం

మెరుగైన విద్యకు చర్యలు



మేడూరులో స్థానికులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు

గూడెంకొత్తవీధి: గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు సూచించారు. శుక్రవారం మండలంలోని జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకు కొద్దిసేపు పాఠాలు బోధించారు. ఈకార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారులు వినాయకరావు, తిరుపతిరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి: బడిఈడు పిల్లలెవరూ బయట ఉండకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ మేడూరు పాఠశాలను సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయులు, విద్యార్థులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. దీన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోషకాల వెదురు.. అమ్మకాల జోరు



మార్కెట్‌కు తీసుకువచ్చిన వెదురు కొమ్ములు

సాక్షి,పాడేరు: గిరిజనులు అమితంగా ఇష్టపడే వెదురు కొమ్ములు, వెదురు కొక్కుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అటవీ ప్రాంతంలోని వెదురు వనాల నుంచి సేకరించిన కొమ్ములను వాటా రూ.50కు విక్రయిస్తున్నారు. అదే ప్రాంతంలో సేకరించిన వెదురు కొక్కులకు మంచి డిమాండ్ ఉంది. పోషకాలు ఎక్కువగా ఉన్నందున ఇగురు, వేపుడుగా తయారు చేసుకుని తింటారు. వీటిని శుక్రవారం పాడేరులో జరిగిన మార్కెట్లో భారీగా విక్రయించారు.

ఏరియా ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- గర్భాశయంలో కణితి తొలగింపు





ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యులు, గర్భాశయం నుంచి తొలగించిన కణితి (ఇన్‌సెట్‌లో)

చింతూరు: స్థానిక ఏరియా ఆసుపత్రికి చెందిన వైద్యులు క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించి గిరిజన మహిళ గర్భాశయంలో ఉన్న పది సెంటీమీటర్ల కణితిని శుక్రవారం తొలగించారు. ఎటపాక మండలం అచ్యుతాపురానికి చెందిన ఇర్పా రాములమ్మ అనారోగ్యంతో లక్ష్మీపురం పీహెచ్‌సీకి వెళ్లగా అక్కడి వైద్యులు ఆమెను చింతూరు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. చింతూరు ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్టులు ఆమెను పరీక్షించి గర్భాశయంలో కుడివైపున కణితి ఉన్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్, మత్తు వైద్య నిపుణుడు డాక్టర్ కోటిరెడ్డి, గైనకాలజిస్టులు డాక్టర్ రమణారావు, డాక్టర్ శశికళాదేవి విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించి కణితిని తొలగించారు. ప్రస్తుతం రాములమ్మ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

వరాల తల్లికి వ్రత పూజలు



పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మోదమ్మ దర్శనానికి బారులు

సాక్షి,పాడేరు: శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మి వ్రతాలను జిల్లావ్యాప్తంగా మహిలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అనంతరం సమీప ఆలయాలను దర్శించి దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి మహిళలు భారీగానే తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన వరలక్ష్మి దేవి సాముహిక వ్రతాల్లో మహిళలు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం వ్రతం జరిపించారు. ఈ కార్యక్రమంలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఇతర ప్రతినిధులు సల్లా రామకృష్ణ, డీపీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అరకులోయ పట్టణంలోని భ్రమరాంబదేవి సహిత మల్లికార్జునస్వామి ఆలయంలోను మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

కేజీబీవీలో జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి స్వర్ణ



స్టాక్‌గదిని పరిశీలిస్తున్న సివిల్ జడ్జి స్వర్ణ

డుంబ్రిగుడ: విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని, జాప్యం జరిగితే అధికారిక చర్యలు తప్పవని పిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి చోడవరం, అరకు ఇన్‌చార్జి జి.స్వర్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవ ఆధికారి ఆదేశాల మేరకు విశాఖపట్నం జిల్లా లీగల్ సర్వీసు ఆధ్వర్యంలో భాగంగా శుక్రవారం రాత్రి 10 గంటలకు స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించారు. ప్రతి ఒక్క తరగతి గదిని క్షణంగా పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం సూచించే మెనూకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ప్రిన్సిపాల్ భవానీకి ఆదేశించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ రూమ్‌లో సరకులను పరిశీలించారు. ఇందులో భాగంగా గదుల్లో కిటికీలకు మెష్‌లు లేకపోవడం, సైడ్ గోడలు లేకపోవడం, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ లీకేజీలను గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. పాఠశాల ప్రాంగణంలో విద్యుత్ లేకపోవడంతో 3 ఫేజ్ విద్యుత్ ఏర్పాటుకు అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు, అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు సమకూర్చే బాధ్యత పాఠశాల సిబ్బందిదేనన్నారు. ఈ వారంలో మరోసారి పాఠశాల తనిఖీకి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ కె.భవానీ, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, సిబ్బంది ఉన్నారు.